క్లుప్తంగా

18న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వేంకటేశ్వరనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామివారి ఆలయ 11వ వార్షికోత్సవం ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రముఖ న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రా రెడ్డి చారిటబుల్‌ట్రస్టు వ్యవస్థాపకులు గొందేశి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో ఆగమ సలహాదారులు ఖండవిల్లి రాధాకృష్ణచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంగర వల్లీకాంతాచార్యులు, భక్తులు సాయంతో నిర్వహిస్తున్నారు. ఆ స్వామివారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భక్తులు పాల్గొనాలని ఉత్సవ కమిటీ కోరింది.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించాలని రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

28వ డివిజన్‌లో

నగర పాలక సంస్థ పరిధిలోని 28వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న నేతృత్వంలో ఆదివారం ఉదయం 10 పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కావున పార్టీనాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు అందరూ హాజరుకావాలని కోరారు.

స్వస్థత శాలలో ప్రత్యేక ప్రార్థనలు

కడియం: స్థానిక షారోన్ దైవిక స్వస్థత శాలలో దామిరెడ్డిపల్లి బైబిల్ మిషను మహిమ మందిరం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. పరీక్షలకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో సరోజిని, సన్నిధి స్త్రీలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కవి రత్నాజీకి సత్కారం



రత్నాజీని సత్కరిస్తున్న సుదర్శన్ తదితరులు

సీటీఆర్ఐ: చాగల్లుకు చెందిన ప్రముఖ దళిత కవి నేలపూరి రత్నాజీని సత్కరించడం ఆనందంగా ఉందని ప్రజాపత్రిక సంపాదకులు సుదర్శన్ అన్నారు. శనివారం స్థానిక కంబాలచెరువు వద్ద గల అశోక్ మహల్‌లో జరిగిన ప్రజాపత్రిక 96వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రత్నాజీ రచించిన రాజ్యాధికార తాళం చెవి వచన కవిత్వానికి ఈ సత్కారం చేశారు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, హేతవాదు విశ్లేషకులు దేవరాజు మహారాజ్, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, పిల్లి డేవిడ్ కుమార్, ప్రసద్, డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కప్ 2023 ప్రారంభం

ప్రకాశం నగర్: మదీనా మజీద్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఏఆర్ గ్రౌండ్స్‌లో రంజాన్ కప్ 2023 టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఈ పోటీలను అబ్దుల్లా టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఈ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 16 టీములు పాల్గొంటున్నాయని, టోర్నమెంట్ విజేతకు రూ.20 వేలు నగదు, ట్రోఫీ, రన్నర్‌కు రూ.10వేలు నగదు, ట్రోఫీతో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్ వంటి బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మదీనా మసీద్ సెక్రటరీ అల్తాఫ్, టోర్నమెంట్ నిర్వాహకులు మహ్మద్ అలీ, చిష్టి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను కాపాడాలి

ప్రకాశం నగర్: గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని, ఆస్తులను కాపాడాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన తండ్రి కనికిరెడ్డి జ్ఞాపకార్థం శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టే నారాయణమ్మ అనే దాత 40ఏళ్ల క్రితం గౌతమీ జీవకారుణ్య సంఘానికి 19.7 ఎకరాల స్థలాన్ని దానం చేశారని తెలిపారు. గత ఎంపీ మాగంటి మురళీమోహన్ భోజనాలు చేసేందుకు హాలు నిర్మాణం చేశారని, ప్రస్తుత ఎంపీ మార్గాని భరత్‌రామ్ కోటి రూపాయలతో మూడు హాళ్ల నిర్మాణం చేశారని, వాటిలో వృద్ధుల కాలక్షేపానికి టీవీ, పేపర్ సదుపాయాన్ని కల్పించారన్నారు. నగరాన్ని బిచ్చగాళ్లు లేని విధంగా తయారు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి. సుబ్బమ్మ, టి.ఉమామహేశ్వరి, టి. వెంకట సత్యనారాయణ రెడ్డి, టి.పద్మావతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళా వైభవం

- అందమైన వస్తువులకు కేరాఫ్ అడ్రాస్ లేపాక్షి
- కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో చైనా బొమ్మలకు చెక్
- 10 నుంచి 40 శాతం వరకూ రాయితీ



ఏటికొప్పాక బొమ్మలు



కొండపల్లి బొమ్మలు



కొండపల్లి బొమ్మ



వేపచెక్కతో చేసిన వేంకటేశ్వర స్వామి వారి ప్రతిమ

సీటీఆర్ఐ: అందమైన వస్తువులకు లేపాక్షి నిలయంగా మారింది. ఇక్కడ కొండపల్లి, ఏటికుప్పాక తదితర బొమ్మలన్నీ లభిస్తాయి. ఈ బొమ్మలు ఎంత ఆకర్షణీయంగా ఉంటాయో ధర కూడా ఎక్కువ ఉంటుంది. అయితే ఈ ధర కన్న చౌకగా మార్కెట్‌లోకి చైనా వస్తువులు ముంచెత్తాయి. పిల్లలకు కావాల్సిన ఆకర్షణీయమైన బొమ్మలు కూడా చైనా బొమ్మలు ఆక్రమించాయి. దీనితో మార్కెట్‌లో మన వాళ్ల తయారి చేసిన వస్తువులకి గిరాకీ పడిపోయింది. దీంతో వస్తువులు తయారీపై ఆధారపడ్డ కార్మికులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా చాలా ఇబ్బందులకు గురయ్యారు. వారిని ఆదుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం లేపాక్షిని స్థాపించింది. రాజమహేంద్రవరం నగరంలో గోకవరం బస్టాండ్ వద్ద 1982లో లేపాక్షి ఎంపోరియాన్ని ఏర్పాటు చేశారు. గత 40ఏళ్లుగా ఇక్కడ రకరకాల చేనేత వస్తువులను విక్రయిస్తున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటోంది.

చైనా బొమ్మలకు చెక్..

చైనా వాళ్ల తయారు చేసే వస్తువులు ఆకర్షణీయంగా ఉండడమే కాకుండా అతి తక్కువకి మార్కెట్‌లోకి వస్తున్నాయి. రంగురంగుల్లో ఉండడంతో పిల్లలు వాటికి ఆకర్షితులవుతున్నారు. దీంతో చైనా వస్తువులను చెక్ పెట్టే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొండపల్లి బొమ్మలను, ఏటికొప్పాక బొమ్మల తయారీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. నాణ్యతతో పాటు, పిల్లలు, పెద్దలను ఆకర్షించేలా తయారు చేయడంతో ఇప్పుడు వీటికి ఆధరణ పెరుగుతోంది. ఈ బొమ్మలు విదేశాలకు కూడా దిగుమతవుతున్నాయి. ఎంతో ఆకర్షణీయంగా, రంగు రంగుల డిజైన్లతో అందరికీ అందుబాటు ఉంటే ధరలో విక్రయంచడంతో ఇప్పుడు వీటికి గిరాకీ పెరిగింది.

వైజాగ్‌లో మెరిసిన లేపాక్షి వస్తువులు

అంతర్జాతీయ స్థాయిలో వైజాగ్‌లో జరిగిన బిజినెస్ సమ్మిట్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో లేపాక్షి స్టాల్ అందరినీ ఆకర్షించాయి. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్క బిజినెస్ పర్సన్ లేపాక్షిలో ఏర్పాటు చేసిన వస్తువులను ఆసక్తితో తిలకించారు. ముఖ్యంగా కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అత్యంత ఆకర్షణీయంగా, ఎంతో చూడముచ్చటగా ఉన్న ఆ బొమ్మల తయారీదారులను మెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి వస్తువులకి, చేనేత కళాకారులకు ఇస్తున్న ప్రాధాన్యత తెలుసుకుని ఆశ్చర్యపోయారు.

అన్ని అందుబాటులో...

రాజమహేంద్రవరం లేపాక్షి ఎంపోరియంలో అన్ని రకాల చేనేత వస్తువులు ఇక్కడ విక్రయిస్తున్నారు. ఏటా ఇయర్ ఎండింగ్ సేల్స్‌లో డిస్కౌంట్ ఇచ్చి ఇక్కడ వస్తువులను అందరికీ చేరేలా విక్రయిస్తారు. దానిలో భాగంగా ఇప్పుడు ప్రతి వస్తువుపై 10 శాతం నుంచి 40 శాతం వరకూ తగ్గింపు ధరలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో బొబ్బిలి వీణ, బ్రాస్‌తో తయారు చేసిన వస్తువులు, తిరుపతి చేనేత కళాకారులు తయారు చేసిన గ్లాస్ బీడ్స్, అళ్లగడ్డ స్టోన్ కార్వింగ్, మన్యం జిల్లా తయారు చేసిన ఆదివాసీ వస్తువులు, పశ్చిమ గోదావరి జిల్లా కుచ్చుగొన్సు, చెక్కతో తయారీ చేసిన వస్తువులు, ఇమిటేషన్ గోల్డ్ జ్యూయలరీ, రెడ్ శాండల్ వుడ్ బొమ్మలు, బ్రాస్‌వేర్, బేంబో క్రాఫ్ట్, లెదర్ ఇంటియర్ వేర్స్, రాతి చేసిన దేవుని బొమ్మలు, కళంకారీ, బ్రాంజ్ వస్తువులు, కొండపల్లి బొమ్మలు, ఏటి కొప్పాక బొమ్మలు, కాటన్ చీరలు, దుప్పట్లు ఇంకా ఎన్నో వైవిధ్యమైన వస్తువులు ఇక్కడ లభిస్తున్నాయి.

పది నుంచి 40 శాతం రాయితీ



రాజమహేంద్రవరం లేపాక్షి ఎంపోరియంలో చేనేత కళాకారులు చేసిన అన్ని రకాల నాణ్యమైన వస్తువులు ఇక్కడ లభిస్తాయి. చేనేత కళాకారులను ఆదుకోవడానికి వారిని ప్రోత్సహించడానికి డిస్కౌంట్ సేల్స్‌ని ఏర్పాటు చేశాం. ప్రతి వస్తువుపై పది నుంచి 40 శాతం వరకూ రాయితీ ఇస్తున్నాం. ఈనెల 31వ తేదీ వరకూ రాయితీ అందుబాటులో ఉంటుంది. చేనేత వస్తువులను కొనడం ద్వారా వారికి ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని మనం మేలు చేసిన వారమవుతాం.

– ఎ. కార్తిక్ కుమార్, మేనేజర్, లేపాక్షి రాజమహేంద్రవరం

విద్యార్థి దశలో పదో తరగతి కీలకం



విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక నాగరాజా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఐ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటి వద్ద ప్రశాంత వాతావరణం కల్పించాలని, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పాఠశాలలో ప్రత్యేక తరగతులకు విధిగా హాజరయ్యేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే విద్యార్థులు మరింత ఉత్సాహంగా చదువుతారన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చక్రధర్, పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు సాయం



శస్త్రచికిత్స నుంచి కోలుకుని ఉత్సాహంగా ఉన్న బ్లెసీతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: పొట్టిలంక గ్రామానికి చెందిన సిరికొండ సురేష్ రెండేళ్ల కుమార్తె కీర్తనబ్లెసీ గుండెలో రంధ్రం ఉంది. చిన్నారికి చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నాడు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఈ విషయాన్ని రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్‌బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయలు సీఎం సహాయనిధి నుంచి అందజేశారు. దీంతో చిన్నారికి శస్త్రచికిత్స విజయవంతమైంది. బ్లెసీ కోలుకున్నాక సురేష్ దంపతులు శనివారం చందన నాగేశ్వర్‌ను రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సిరికిండ సురేష్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పాప ఆరోగ్యం రీత్యా 8 నెలలుగా విధులకు హాజరు కాలేకపోయాడు. దీంతో ఉద్యోగం నుంచి తొలగించే పరిస్థితి ఎదురైంది. దీంతో కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్‌తో చందన మాట్లాడి అతడి ఉద్యోగం పోకుండా చందన కాపాడారు. తమ కుటుంబానికి అంతటి సాయం అందించిన సీఎం జగన్‌ను, కో ఆర్డినేటర్ చందనలకు రుణపడి ఉంటామని బ్లెసీ కుటుంబం తెలిపింది. కార్యక్రమంలో శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, పార్టీ నాయకులు కొత్తపల్లి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత ముద్దాయిలను బైండోవర్ చేయండి

జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సోమశేఖర్



సౌత్ స్టేషన్‌లో రిజిష్టర్‌లు పరిశీలిస్తున్న డీఎస్ఈఓ సోమశేఖర్

రాజమహేంద్రవరం రూరల్: సారా, గంజాయి, మత్తుపదార్థాల పాతనేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(డీఎస్ఈవో) పి.సోమశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఈబీ సౌత్‌స్టేషన్‌ను సందర్శించి, రిజిష్టర్లను తనిఖీ చేశారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, ఎస్సైలు రామశేషయ్య, చిట్టిబాబులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్ఈవో సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని మాదకద్రవ్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. సారా, గంజాయి, మత్తు పదార్థాల అమ్మకం, రవాణా వంటివి అరికట్టడానికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మళ్లీ మళ్లీ నేరానికి పాల్పడిన వారిపై పిడియాక్ట్‌లు నమోదు చేయాలని ఆదేశించారు. పరివర్తన చెందిన సారా నేరస్తులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం మార్గాలు చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఆయన వెంట ఉన్నారు.

నర్సరీ సందర్శన



దేవరాజ్, కృష్ణకుమారిలకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతు గణపతి తదితరులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ దేవరాజ్ మహరాజు, కృష్ణకుమారి దంపతులు శనివారం సందర్శించారు. నర్సరీ రైతు పల్ల గణపతి వారికి మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. దేశ వ్యాప్తంగా పర్యావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న నర్సరీ రైతులను వారు అభినందించారు. వారి వెంట ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, ప్రముఖ కవి డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, ఎల్.శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు అభినందన

ప్రకాశంనగర్: విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర జిల్లా సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియనషిప్‌లో ప్రతిభ చాటి తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫుట్‌బాల్ మహిళ జట్టు సభ్యులను శనివారం పలువురు అభినందించారు. విజేతలకు సీతాన బోయిన సాయిరామ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ పి.సంజీవ్‌కుమార్ డిక్షనరీలు అందజేశారు. అభినందించిన వారిలో జిల్లా ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ సభ్యులు, ఎస్‌కేవీటీ ప్రిన్సిపాల్ రాజాబాబు, జిల్లా అసోసియేషన్ గౌ.కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, సీనియర్ ఫుట్ బాల్ క్రీడా కారుడు సీరా గంగాధర్, వ్యాయామ అధ్యాపకులు పీఏ కిషోర్ బాబు తదితరులు ఉన్నారు.

పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు



ఎస్పీ కార్యాలయంలో వద్ద బాధితురాలు లావణ్య, తల్లిదండ్రులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తనకు న్యాయం చేయమని దిశ పోలీస్ స్టేషన్‌కు వెళ్లితే అక్కడ అధికారులు తమను దుర్భాషలాడుతున్నారని పల్లపు లావణ్య వాపోయింది. దీనికి సంబంధించి ఆమె శనివారం ఫిర్యాదు పత్రాలతో ఎస్పీని కలిసి తమ బాధను విన్నవించుకున్నట్టు ఆమె తెలిపింది. తన భర్త పల్లపు వినోద్‌బాబు గత కొంత కాలంగా శారీరకంగా వేధిస్తున్నాడని, తన మరిది, అత్తమామలు అదనపు కట్నం కోసం హింసిస్తున్నారని ఆమె తెలిపింది. దీనిపై దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దీంతో పోలీసులను తన భర్తను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారన్నారు. అయితే తిరిగి మళ్లీ తనను వేధిస్తుండడంతో ఈనెల 10వ తేదీన దిశ పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ డీఎస్పీ తమపై దురుసుగా ప్రవర్తించారన్నారు. తనకు, తన బిడ్డకు ప్రాణ హాని ఉందని, తమను రక్షించాలని ఎస్పీకి తెలిపింది. దీనిపై దిశ డీఎస్పీ తిరుమలరావును వివరణ కోరగా మూడు సార్లు కౌన్సిలింగ్ చేసి పంపామని, ఆమె భర్తపై కేసు పెట్టమనే చెబుతుందని, మెయింటనెన్స్ ఇప్పించాలని కోరుతుందని ఆయన తెలిపారు. మెయింటనెన్స్ విషయంలో పోలీసులకు ఎటువంటి అధికారం లేదన్నారు.

శ్రీరంగపట్నం సొసైటీ సీఈఓ సస్పెన్షన్

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్ సీఈఓ మల్లిరెడ్డి శ్రీనివాసరావును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు చైర్‌పర్సన్ బుద్దా శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, సొసైటీ కార్యకలాపాలకు ఆటంకంగా మారడం, రికార్డులను పాలక మండలికి చూపించకపోవడం, రూ.50 లక్షల మేర నిధుల దుర్వినియోగం కావడంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనపై చర్య తీసుకున్నారని తెలిపారు. శ్రీరంగపట్నంతో పాటు, కోటి, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, రాఘవపురం, గరగలంపాలెం గ్రామాలకు చెందిన 2,800 మంది రైతులకు తమ సొసైటీ సేవలు అందిస్తోందని వివరించారు. ఏటా రూ.16 కోట్ల టర్నోవర్ వచ్చేదని, సీఈఓ శ్రీనివాసరావు తీరు కారణంగా అది రూ.9 కోట్లకు పడిపోయిందన్నారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల డివిజినల్ కో ఆపరేటివ్ అధికారి ఉమా పార్వతి ఆధ్వర్యంలో అధికార బృందం తనిఖీలు నిర్వహించిందని చెప్పారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో సీఈఓ శ్రీనివాసరావు కార్యాలయం, దానిలోని బీరువా తాళాలుబద్దలుగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయనపై రైతుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. సొసైటీకి తాత్కాలిక సీఈఓగా కాళ్ల నాగ వెంకట గణపతిస్వామిని నియమించారని చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

పోరాటాలతోనే మహిళల హక్కులకు రక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రకాశంనగర్: పోరాటాలతోనే మహిళల హక్కులకు రక్షణ సాధ్యపడుతుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (ఐద్వా) యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపాల్ ఆఫీసు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి దేవీచౌక్ మీదుగా కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ వరకూ వందలాది మంది మహిళలు, వివిధ రంగాలకు చెందిన స్కీం వర్కర్లు ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం హైటెక్ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవం ఉత్సవం కాదని దీక్ష దీనమన్నారు. మహిళలు హక్కులు కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. ఈ సభకు టి.తులసి అధ్యక్షత వహించగా, అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబిరాణి, యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.విజయగౌరి, ఐద్వా జిల్లా అధ్యక్షులు జరీనా, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో రాజ్‌భవన్

రాజమహేంద్రవరం సిటీ: దేశవ్యాప్తంగా ఆదాని నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ నిర్వహించాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. శనివారం కృష్ణ నగర్‌లో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సూచనల మేరకు ఈనెల 13వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో రాజభవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఆదాని అక్రమ వ్యాపారాలు నిగ్గు తేల్చే వరకూ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. 13న జరిగే చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆకుల భాగ్య సూర్యలక్ష్మి, పీసీసీ కార్యదర్శి ముళ్ల మాధవ్, ఇజ్జరౌతూ విజయలక్ష్మి, కిషోర్ కుమార్ జైన్, నల్లబాటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



సినీ నటుడు సుమన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అను

ప్రకాశంనగర్: కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఒక సినిమా షూటింగ్ కోసం రాజమహేంద్రవరానికి వచ్చిన సుమన్‌ను వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతి రావు(అను) మార్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఇస్తున్నారని కొనియాడారు. బ్రాహ్మణ సంఘం కార్యదర్శి స్వాతంత్ర్యసమరయోధులు వావిరాల గోపాలకృష్ణ మనవడు వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ కల్యాణిరెడ్డి పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఫర్నిచర్ చోరీ

కంబాలచెరువు: స్థానిక పేపర్‌మిల్ వద్ద నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రిలో ఫర్నిచర్ గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటనపై శనివారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆసుపత్రి నిర్మాణంలో వాడే రూ.15 వేలు విలువైన రాగి పైపులు చోరీకి గురయ్యాయి. దీనిపై ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.